# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 78 | పేజీలు: 4 | వెల: 4/- | గురువారం ● 10, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## తన కూతురు వివాహానికి సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** తన కూతురు శ్రేయ రెడ్డి వివాహ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డిని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆహ్వానించారు. బుధ వారం జూబ్లీహిల్స్ లోని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్వగృహానికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లా రెడ్డి తో కలిసి తన కూతురు



శ్రేయా రెడ్డి వివాహానికి ఈ నెల 27 న హాజరై వధూ వరులను ఆశీర్వదించాలని పెళ్లి పత్రికను అందజేసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు జిఎంఆర్, శామ్యూల్ లు పాల్గొన్నారు.

## మహిళలకు సిఎం రేవంత్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు




**హైదరాబాద్,అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు తెలంగాణ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.. తీరొక్క పూలతో రూపొందించే ఘనమైన బతుకమ్మలతో ఆడిపాడే సంబురాల్లో అఖరి రోజైన సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని తెలంగాణలోని అక్కాచెల్లెళ్లందరకీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా ట్యాంక్ బండ్‌తోపాటు రాష్ట్రంలోని చెరువులన్నింటి వద్ద ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

### డేవిడ్ బెకర్, డెమిస్ హసబిస్, జాన్ ఎం.జంపర్‌ల ఎంపిక

**స్టాక్‌హోం,అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** రసాయన శాస్త్రంలో విశేష పరిశోధనలు జరిపిన ముగ్గురు శాస్త్రవేత్తలకు ఈ ఏడాది నోబెల్ బహుమతి లభించింది. ప్రొటీన్ల డిజైన్లకు సంబంధించిన పరిశోధనలకుగానూ శాస్త్రవేత్తలు డేవిడ్ బెకర్, డెమిస్ హసబిస్,



జాన్ ఎం.జంపర్‌ను ఈ ఏడాది నోబెల్ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది. కంప్యుటేషనల్ ప్రొటీన్ డిజైన్‌కుగానూ బెకర్, ప్రొటీన్ స్ట్రక్చర్ ప్రిడిక్షన్‌కుగానూ డెమిస్,

మిగతా.. 2లో

## కాంగ్రెస్‌వన్నీ విభజన రాజకీయాలు



### హర్యానా ఫలితాలపై వక్రభాష్యాలు

### మండిపడ్డ ప్రధాని మోడీ

**ముంబయి,అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** సమాజంలో కాంగ్రెస్ విష బీజాలు నాటుతూ.. హిందువులను విభజించాలని చూస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ తీరును విమర్శిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటున్నా రని దుయ్యబట్టారు. హరియాణా ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయాన్ని ప్రస్తావిస్తూ,

మిగతా.. 2లో



## సమాజానికి సమర్థులైన పౌరులను అందించండి

### వారిని తీర్చి దిద్దే బాధ్యత టీచర్లుగా మీపైనే ఉంది

### సమాజంలో బడులే కీలక భూమిక పోషించాలి

### కొలివి దయ్యాన్ని నమ్ముకోవడం వల్లనే ఉద్యోగాలు రాలే

### ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగు పర్చేలా చర్యలు

### డిఎస్సీ నియాక పత్రాల అందచేతలో సిఎం రేవంత్

**హైదరాబాద్,అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** సమర్థులైన పౌరులను తీర్చిదిద్దే బాధ్యత కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న టీచర్లపైనే ఉందని, పాఠశాలలు అందుకు వేదిక కావాలని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మీకు వచ్చిన ఈ బాధ్యతను సమర్థంగా ఉపయోగించి సమాజానికి మంచి పౌరులను అందించాల న్నారు. కెసిఆర్ ఇంట్లో ఉద్యోగాలు ఊడగొట్టడం వల్లనే ఇవాళ తెలంగాణలో కొలువుల జాతర సాగుతోందన్నారు. డీఎస్సీ విజేతలను చూస్తే దసరా పండుగ ముందే వచ్చినట్లు అనిపిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. టీచర్లే తెలంగాణ వారధులు.. నిర్మాతలని, పేద విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత వారిపైనే ఉందని తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలను సిఎం రేవంత్ స్వయంగా అందజేసారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ కొత్త టీచర్లకు కీలక సూచనలు చేశారు. తెలంగాణలో 30వేల పాఠశాలలు ఉంటే.. 24లక్షల మంది విద్యార్థులు

మిగతా.. 2లో



## వరద బాధితులకు ఎల్ అండ్ టి భారీ విరాళం

**హైదరాబాద్,అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** వరద బాధితుల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి నిధులు అందుతూనే ఉన్నాయి. తాజాగా ఎల్ అండ్ టీ సంస్థ రూ.5.50 కోట్ల భారీ విరాళం ఇచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఎల్ అండ్ టీ ఛైర్మన్ కలిసి ఇందుకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సిఎం వారిని అభినందించారు.

## పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా కన్నుమూత

### అనారోగ్యంతో ముంబై బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో తుదిశ్వాస

### టాటా గ్రూపును 10 వేల కోట్ల డాలర్ల సామ్రాజ్యంగా విస్తరింపజేసిన సమర్థ వ్యాపారవేత్త.. దాతృత్వంలో మేటి

### భారత ఆటోమొబైల్ సంస్థలకు కార్లు తయారు చేసే సత్తా లేదన్న అపప్రథకు 'ఇండికా' కారు తయారీతో అడ్డుకట్ట

### నష్టాల్లో ఉన్న బ్రిటన్ కంపెనీలు జాగ్వార్, లాండ్‌రోవర్‌లను కొని లాభాలబాటలోకి నడిపించిన నాయకుడు



(రతన్ టాటా 1937 - 2024)

**ముంబై, అక్టోబరు 9,(నమస్తే ఉదయం):** భారత దేశ పారిశ్రామిక చరిత్రలో ఒక శకం ముగిసింది! జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య యవనికపై తనదైన ముద్ర వేసిన పారిశ్రామిక వేత్త, చైర్మన్ ఎమెరిటస్ ఆఫ్ టాటా సన్స్.. రతన్ నావల్ టాటా (86) ఇక లేరు. వంటగదిలో వాడే ఉప్పు నుంచి.. ఆకాశంలో ఎగిరే విమానాల దాకా.. ఎన్నెన్నో ఉత్పత్తులు, సేవలతో భారతీయుల నిత్యజీవితంలో భాగమైన టాటా సామ్రాజ్యాన్ని రెండు దశాబ్దాలపాటు నడిపించిన ఆ పారిశ్రామిక దిగ్గజం.. మరలిరాని లోకాలకు తరలిపోయారు! రక్తపోటు స్థాయిలు అకస్మాత్తుగా పడిపోవడంతో మూడు రోజుల క్రితం ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో చేరిన రతన్ టాటా ఆరోగ్య పరిస్థితి విషమించి.. బుధవారం రాత్రి తుది శ్వాస విడిచారు. తన ఆరోగ్యంపై సోషల్ మీడియాలో ఆందోళన వ్యక్తం కావడంతో.. 'నేను బాగానే ఉన్నా.. ఆందోళన వద్దు' అంటూ ప్రకటన చేసిన మూడురోజులకే ఆయన కన్నుమూశారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జంషెట్జీ టాటాకు ముని మనవడైన రతన్ టాటా 1937 డిసెంబరు 28న ముంబైలో జన్మించారు. తల్లిదండ్రులు సూని టాటా, నావల్ టాటా.. ఆయన పుట్టిన పదేళ్లకు విడిపోవడంతో, రతన్ టాటా తన నాయనమ్మ అయిన నవాజ్‌బాయ్ టాటా వద్ద పెరిగారు. ముంబై, సిమ్లాల్లో కొంతకాలం చదివిన అనంతరం.. ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం అమెరికాకు వెళ్లారు. అమెరికాలోని రివర్‌డేల్ కంట్రీ హైస్కూల్‌లో పట్టా పుచ్చుకున్న

మిగతా.. 2లో







## శాసన మండలి చీఫ్ విప్‌గా డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి

### - బాధ్యతలు చేపట్టిన పట్నం మహేందర్ రెడ్డి

**రాజేంద్రనగర్,అక్టోబర్ 09(నమస్తే ఉదయం):** రాష్ట్ర శాసనమండలి చీఫ్ విప్ గా పట్నం మహేందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,మంత్రులు శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్ హాజరై అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...రాష్ట్ర చట్టసభల్లో సుదీర్ఘ అనుభవమున్న మహేందర్ రెడ్డికి మండలి చీఫ్ విప్ రావడం సంతోషకరం అన్నారు. మండలిలో శాసన తయారీ ప్రక్రియ,చర్చ లాంటి అంశాల్లో తోటి సభ్యులకు చేదోడువాదుడుగా పట్నం ఉంటారన్నారు. ఆయనతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలకు మరింత సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. అనంతరం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ...మండలి చీఫ్ విప్ గా అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలిలో సీనియర్ సభ్యుడిగా సభ్యులందరికీ చేదోడు వాదోడుగా ఉంటానన్నారు.



శాసనమండలి చీఫ్ విప్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి కి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాష్ట్రంలో ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందరితో కలిసి చట్టసభల ద్వారా ప్రజలకు అందుబాటులో వచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. స్పీకర్‌తో కలిసి అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని, అందరికీ అందుబాటులో ఉంటామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు టి.ప్రకాష్ గౌడ్ రామ్మోహన్ రెడ్డి,ఈర్లపల్లి శంకర్,మల్ రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీలు కోదండరాం, బల్మూరి వెంకట్,ఎగ్గే మల్లేష్, భాను ప్రకాష్, ప్రభాకర్,మాజీ ఎంపీలు మధుయాష్కి గౌడ్,గడ్డం రంజిత్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## 2028 డిసెంబర్ వరకు ఉచిత బియ్యం పంపిణీ

### ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన కింద ఫోర్టిఫైడ్ రైస్

### లోథాల్‌లో 'నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్' అభివృద్ధి

### కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ,అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** పేదల కోసం కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రి వర్గం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజనతో పాటు ఇతర సంక్షేమ పథకాల కింద ఇక నుంచి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించింది. గరీబ్ కల్యాణ్ యోజన పథకాన్ని 2028 డిసెంబర్ వరకు పొడిగించారు. అంటే అప్పటి వరకూ పేదలకు ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తారు. కేంద్రం వందశాతం నిధులతో పోషకాహారం అందించేందుకు వీటిని సరఫరా చేయాలని

మిగతా.. 2లో

# కొలువుల కోసమే ప్రత్యేక తెలంగాణ పోరాటం

### దానినే విస్మరించిన గత ప్రభుత్వం
### డీఎస్సీని అడ్డుకునేందుకు అనేక యత్నాలు
### ఎల్బీ స్టేడియం కార్యక్రమంలో భట్టి

హైదరాబాద్,అక్టోబర్ 9(నమస్తే ఉదయం): కొలువుల కోసమే ప్రత్యేక తెలంగాణ పోరాటం జరిగిందని.. అయినా, గత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై ఎలాంటి చర్య తీసుకోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. దశాబ్ద కాలం డీఎస్సీ గురించి ఆలోచన చేయలేదని ఆక్షేపించారు. పేదలకు నాణ్యమైన విద్య అందించాలనే తపనతోనే టీచర్ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నామన్నారు. ప్రతిపక్షం డీఎస్సీపై ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా, ఆటంకాలు సృష్టించినా అనుకున్న సమయానికి డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో టీచర్లకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో భట్టి మాట్లాడారు. ఏళ్ల తరబడి పదోన్నతులు, బదిలీల్లేక టీచర్లు ఇబ్బందులు పడ్డారు. మా ప్రభుత్వం రాగానే టీచర్ల పదోన్నతులు, బదిలీలు పూర్తి చేసింది. డీఎస్సీపై ప్రతిపక్షం



చాలా కుటిల ప్రయత్నాలు చేసింది. అయినా.. డీఎస్సీ ప్రక్రియ ఆగలేదని అన్నారు.

మరోవైపు, రాష్ట్రంలో 10వేల మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 11,062 పోస్టుల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. కేవలం ఏడు నెలల్లోనే మెగా డీఎస్సీ ప్రక్రియను రేవంత్ సర్కార్ పూర్తి చేసింది. డీఎస్సీ పరీక్షలకు 2.46లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు.


బ్యాక్‌లాగ్ పోస్టులు మిగిలిపోకుండా మొత్తం ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. మొత్తం 2,515 స్కూల్ అసిస్టెంట్లు, 685 భాషా పండితులు, 6277 ఎస్‌జీటీ, 145 పీఈటీ, 103 స్పెషల్ ఎడ్యుకేటర్ల పోస్టులు, 281 ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను భర్తీ చేశారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచి 761మంది, అత్యల్పంగా పెద్దపల్లి జిల్లా నుంచి 82మందినియామక పత్రాలు అందుకోనున్నారు. కోర్టు కేసులు, ఇతర సమస్యలతో 1056 పోస్టుల భర్తీ ప్రక్రియ పెండింగ్‌లో ఉందని వివరించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తున్నామని అన్నారు.

# పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం కార్నెల్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ అండ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. 1959లో డిగ్రీ పట్టా పుచ్చుకున్న రతన్ టాటా.. 2008లో అదే కార్నెల్ యూనివర్సిటీకి 50 మిలియన్ డాలర్ల విరాళం ఇచ్చారు. ఆ విశ్వవిద్యాలయ చరిత్రలోనే అతిపెద్ద అంతర్జాతీయ దాతగా నిలిచారు. అమెరికాలో పట్టభద్రుడైన అనంతరం.. 1961లో ఆయన టాటా గ్రూపులో చేరారు. తొలుత టాటా స్టీల్‌లో చిరుద్యోగిగా చేరిన ఆయన గ్రూపులోని వివిధ కంపెనీల్లో విభిన్న హోదాల్లో పనిచేశారు. 1971లో నేషనల్ రేడియో అండ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ డైరెక్టర్ ఇన్‌చార్జిగా.. 1981లో టాటా ఇండస్ట్రీస్ చైర్మన్‌గా.. ఇలా పలు బాధ్యతలు నిర్వర్తించారు.

ఎంత ఎదిగినా ఒదిగి ఉండే విద్యార్థిలాగా నిరంతరం ఏదో ఒకటి నేర్చుకుంటూ ఉండేవారు. ఈ క్రమంలోనే 1975లో అమెరికాలోని హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ పూర్తిచేశారు. 1991లో జేఆర్‌డీ టాటా అనంతరం టాటా సన్స్ చైర్మన్‌గా పగ్గాలు చేపట్టి.. 2012 డిసెంబరు 28వ తేదీన రిటైరయ్యేదాకా సంస్థను సమర్థంగా నడిపారు. ఆ తర్వాత మళ్లీ 2016 అక్టోబరు నుంచి 2017 ఫిబ్రవరి దాకా తాత్కాలిక చైర్మన్‌గా ఉన్నారు.



1991లో ఆయన పగ్గాలు చేపట్టే సమయానికి టాటా గ్రూప్‌లో ఉన్న కంపెనీల సంఖ్య దాదాపు 250 దాకా ఉండేది. కానీ, ఆయన వాటిని 98కి తగ్గించి సంస్థ సామర్థ్యాన్ని పెంచారు. టాటా గ్రూపు.. హై టెక్నాలజీ వ్యాపారాల్లో ప్రవేశించేందుకు బీజం వేశారు. టాటా గ్రూప్ ఆయన హయాంలోనే 10 వేల కోట్ల డాలర్ల వ్యాపార సామ్రాజ్యంగా అవతరించింది. తన సమర్థ నాయకత్వంలో ఆయన టాటా మోటార్స్, టాటా స్టీల్, టీసీఎస్, టాటా పవర్, టాటా గ్లోబల్ బెవరేజెస్, టాటా కెమికల్స్, ఇండియన్ హోటల్స్, టాటా టెలీ సర్వీసెస్ సంస్థలను అగ్రశ్రేణి సంస్థలుగా తీర్చిదిద్దారు. టీసీఎసను.. దేశంలో వెయ్యికోట్ల డాలర్ల వార్షిక ఆదాయం మైలురాయి దాటిన తొలి భారత ఐటీ కంపెనీగా నిలిపారు. వ్యాపారవేత్తగానే కాదు.. తన ఆదాయంలో 60 నుంచి 65 శాతం మేర వివిధ దాతృత్వ కార్యక్రమాలకు కోసం ఉదారంగా ఇచ్చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. భారత ప్రభుత్వం ఆయనను 2000 సంవత్సరంలో పద్మభూషణ్‌తో, 2008లో పద్మవిభూషణ్‌తో గౌరవించింది. మరెన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను, గౌరవ డాక్టరేట్లను రతన్ టాటా అందుకున్నారు.

### బహుముఖ విస్తరణ

రతన్ టాటా హయాంలో టాటా గ్రూపు దేశ, విదేశాల్లో అనేక కొత్త వ్యాపారాల్లోకి విస్తరించింది. అన్నిటి కంటే ముఖ్యంగా 'ఇండికా' కారును దేశీయంగా అభివృద్ధి చేయడం ద్వారా, భారత ఆటోమొబైల్ కంపెనీలకు సొంతంగా కార్లను అభివృద్ధి చేసే సత్తా లేదన్న ప్రచారానికి ఆయన తెరదించారు. నానో కారు ద్వారా రతన్ టాటా లక్ష రూపాయలకే మిడిల్ క్లాసుకు సొంత కారు భాగ్యం కల్పించారు. అలాగే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న బ్రిటిష్ లగ్జరీ కార్ల కంపెనీ జాగ్వార్, ల్యాండ్ రోవర్‌ను కొనుగోలు చేయడం ద్వారా, టాటా మోటార్స్ కంపెనీని అంతర్జాతీయ బ్రాండ్‌గా తీర్చిదిద్దారు. బ్రిటన్‌కు చెందిన టెట్లీ టీ బ్రాండ్ కొనుగోలు రతన్ టాటా హయాంలోనే జరిగింది. టాటా స్టీల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా విస్తరించడంతో పాటు, బ్రిటిష్ స్టీల్ కంపెనీని కొనుగోలు చేసి, టాటా స్టీల్ కంపెనీ కార్యకలాపాలను యూరోపకూ విస్తరించారు. ఆయన ప్రారంభించిన వ్యాపారాల్లో నానో కారు, టెలికం వెంచర్లు మాత్రమే అంతగా కలిసి రాలేదు.

### సైరస్ మిస్త్రీతో వైరం

తన తర్వాత టాటా గ్రూప్‌ను సమర్థుడైన వారసునికి అప్పగించాలన్న ఆలోచనతో సైరస్ మిస్త్రీని ఆ పదవికి ఎంపిక చేశారు. కాని వారి బంధం ఎంతో కాలం కొనసాగలేదు. ఆర్థికంగా కంపెనీకి గుదిబండలా మారిన 'నానో' కారు ప్రాజెక్టు ఆపేయాలని మిస్త్రీ చేసిన ప్రయత్నాలకు రతన్ టాటా అడుగడుగునా అడ్డుతగిలారు. తన మానస పుత్రిక అయిన నానో ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో ఆపకూడదని రతన్ పట్టుబట్టడం వల్లే, మిస్త్రీ టాటా గ్రూప్‌కు దూరమయ్యారని చెబుతారు. టాటా గ్రూప్ చరిత్రలో మొదటిసారిగా పార్సీయేతర వ్యక్తి ఎన్ చంద్రశేఖరన్ టాటా గ్రూప్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం వెనక రతన్‌టాటా మద్దతు ఉంది.

### 50కి పైగా స్టార్టప్‌ల్లో పెట్టుబడులు

రతన్ టాటా సమర్థుడైన పారిశ్రామికవేత్త మాత్రమే కాదు.. తెలివైన పెట్టుబడిదారుడు కూడా. యువ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించే విషయంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారు. వ్యక్తిగత హోదాలో ఆయన పేటీఎం, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, స్నాప్‌డీల్, లెన్స్‌కార్ట్ సహా 50కి పైగా స్టార్టప్‌ల్లో ఆయన ఇన్వెస్ట్ చేశారు. అవన్నీ అద్భుత విజయాలు సాధించిన సంస్థలే!

### ఎయిరిండియా కొనుగోలు

టాటా గ్రూప్ నుంచి ప్రభుత్వ పరమైన ఎయిరిండియాను మళ్లీ టాటాల పట్టులోకి తేవాలన్నది రతన్ టాటా చిరకాల వాంఛ. ఇందుకు అడ్డంకులు ఎదురవడంతో సింగపూర్ ఎయిర్‌లైన్స్, మలేషియా ఎయిర్‌లైన్స్‌తో కలిసి విమానయాన రంగంలోకి ప్రవేశించారు. ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణకు అడ్డంకులు తొలగడంతో 2022లో ఆ సంస్థను మళ్లీ టాటా గ్రూప్ కొనుగోలు చేసింది. పీకల్లోతు నష్టాలతో ఉన్న ఎయిరిండియాను కొనేందుకు ఏ ప్రైవేటు సంస్థా ముందుకు రాలేదు. అయినా తమ గ్రూప్ వ్యవస్థాపకుడు జేఆర్‌డీ టాటా ప్రారంభించిన ఎయిర్ ఇండియాను మళ్లీ తమ పట్టులోకి తేవాలనే ఏకైక లక్ష్యంతోనే ఎయిర్ ఇండియాను రతన్ టాటా కొనుగోలు చేశారు. ఇపుడు ఈ సంస్థ అన్ని బాలారిష్టాలను అధిగమిస్తూ పెద్ద ఎత్తున విస్తరణకు సిద్ధమైంది.

### రతన్ టాటా విఫల ప్రేమగాథ!

వ్యాపార దిగ్గజంగా ఎన్నో విజయాలు సాధించిన రతన్ టాటా కూడా ఎంతోమందిలా ఓ లవ్ ఫెయిల్యూరే.. 1962లో భారత్, చైనా దేశాల మధ్య జరిగిన యుద్ధం రతన్ టాటా ప్రేమ విఫలం కావడానికి కారణమైంది. రతన్ టాటా 25 ఏళ్ల వయస్సులో ఉన్నప్పుడు చదువు పూర్తి చేసుకుని అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో ఓ ఆర్కిటెక్చర్ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో అక్కడి ఓ మహిళతో ప్రేమలో పడ్డారు. ఆమెను పెళ్లి చేసుకుని అక్కడే స్థిరపడిపోవాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో ఏడేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నాయనమ్మతో కొద్ది రోజులు గడపడం కోసం ఆయన స్వదేశానికి వచ్చారు. తన కోసం తన ప్రేయసి కూడా భారత్ వస్తుందని ఆశించారు. కానీ, భారత్–చైనా యుద్ధంతో ఆ మహిళ తల్లిదండ్రులు ఆమె భారత్ వెళ్లేందుకు అంగీకరించలేదు. దీంతో వారి ప్రేమకథ ముగిసింది. ఈ తొలి ప్రేమ ఆయనకు ఓ జ్ఞాపకంగా మిగిలిపోయింది. తన ప్రేమకథను పలుమార్లు బయటపెట్టిన రతన్ టాటా ఆ మహిళ ఎవరనేది ఎప్పుడూ చెప్పలేదు. ఆ తర్వాత 1970ల్లో హిందీ చిత్రసీమలో ప్రముఖ నటీమణిగా వెలుగొందిన సిమీ గరేవాల్‌కు రతన్ దగ్గరయ్యారు. వారి అనుబంధం పెళ్లిపీటల వరకు వెళుతుందని ఆశించినా అది జరగలేదు. సిమీ మరొకరిని పెళ్లాడగా రతన్ టాటా ఒంటరయ్యారు. ఇలా మొత్తం నాలుగు సందర్భాల్లో ఆయన పెళ్లి పీటలు ఎక్కేందుకు సిద్ధమైనా వేర్వేరు కారణాలతో అవేవి జరగక ఆజన్మబ్రహ్మచారిగానే ఉండిపోయారు.

### టాటా వారసులెవరు?

రతన్ టాటా మరణంతో ఈ సామ్రాజ్యం పగ్గాలు చేపట్టేందుకు అవకాశాలు, అర్హతలున్న టాటా కుటుంబ వారసుల జాబితాలో నోయెల్ టాటా పేరు ప్రధానంగా చెప్పుకోవాలి. రతన్ టాటా సవతి సోదరుడు నోయల్ టాటా. గ్రూప్ రిటైల్ వర్తక విభాగమైన ట్రెంట్‌తోపాటు పలు వ్యాపారాల్లో ప్రస్తుతం ఆయన క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. నోయెల్ సంతానమైన మాయ, నెవిల్లే, లేహ్ టాటా సైతం పలు టాటా కంపెనీల్లో మేనేజ్‌మెంట్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

### మధ్య తరగతి కారు కల నానో

కారులో ప్రయాణించాలనే భారతీయ మధ్య తరగతి కుటుంబాల కల నెరవేర్చాలని దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా సంకల్పించారు. ఆయన ఈ సంకల్పమే 'నానో' కారు రూపకల్పనకు దారితీసింది. ఈ కారును 2008లో మార్కెట్‌లోకి తెచ్చారు. కేవలం రూ. 1,00,000 ధరే నిర్ణయించి ప్రపంచంలోనే చౌకైన కారుగా ప్రకటించారు. ఇలా అప్పటికి ధనిక వర్గాలకే పరిమితం అయిన కారును మధ్య తరగతి ప్రజలకూ అందుబాటులోకి తెచ్చి వారి కల నెరవేర్చారు. ఈ కారు బయటకు వచ్చాక ఆరంభ కష్టాలు ఎదుర్కొన్నా... ఆటోమొబైల్ మార్కెట్లో సంచలనం సృష్టించింది. ఆటోమొబైల్ పరిశ్రమ కేవలం ఉన్నత వర్గాల కోసమే కార్లను తయారుచేయడం కాకుండా మధ్య తరగతి, దిగువ వర్గాలనూ దృష్టిలో ఉంచుకుని వాహనాలను తయారుచేయాలన్న చర్చకు దారితీసింది. ఈ విషయంలో రతన్ టాటా విజన్ స్పష్టంగా ఉంది... అదేమిటంటే మధ్య తరగతి స్థోమతకు తగ్గ కారును వారి ముందుంచడం... 'నానో'తో ఆయన అది పూర్తిచేశారు.

# సమాజానికి సమర్థులైన పౌరులను అందించండి

(మొదటి పేజీ తరువాయి)

చదువుతున్నారు. ప్రైవేటు యాజమాన్యంలో 10 వేల పాఠశాలలు ఉంటే 34లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటులో మీకంటే ఎక్కువ చదువుకున్నవారు, మీకన్నా గొప్ప వ్యక్తులు, అనుభవం ఉన్నవారు బోధిస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ బడికి వెళ్లడమంటేనే గ్రామాల్లో సైతం నామోషీగా భావిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి పోయిన వారు కూడా తాము తిన్నా తినకపోయినా, పుస్తెలు అమ్మి అయినా తమ పిల్లలను ప్రైవేటు బడి, కాన్వెంట్‌కు పంపాలనుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలకు పంపాలంటే.. ఎందుకు ఇబ్బందిపడుతున్నారో ఆలోచించండి. మీకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించే బాధ్యత నేను తీసుకుంటా.. కానీ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు మీరు కృషిచేయండని సూచించారు. నిరుపేదలు బంగారం అమ్మి ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని పంపే పరిస్థితి మారాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులే ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించాలన్నారు. తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారిని భవిష్యత్తులో డాక్టర్లుగా, లాయర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీదే. నేను ప్రభుత్వ బడిలో చదువుకున్నా.. సీఎం అయ్యాను. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేశవరావు, కోదండరాం వంటి ఎందరో ప్రభుత్వ బడిలోనే చదివారు. కార్పొరేట్ బడిలో చదువుకోలేదు. మీలాంటి టీచర్లు చెప్పిన చదువుతోనే ఈ స్థాయికి వచ్చాం. జాతి నిర్మాతలను తీర్చిదిద్దిన క్షేత్రం ప్రభుత్వ బడి. స్కూళ్లలో అన్ని వసతులూ కల్పించేందుకు కృషిచేస్తున్నాం. అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభిస్తున్నాం. ఈ నెల 11న ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శ్రీకారం చుడుతున్నాం. విద్యకు బ్జడెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయించాం. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరిస్తున్నాం అని అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం నిరుద్యోగులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. రెండుసార్లు కోరి కొరివి దెయ్యాన్ని తెచ్చుకున్నట్లుగా బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చాం. ప్రత్యేక తెలంగాణలో ఉద్యోగాలు



భర్తీ అవుతాయని అందరూ ఆశించినా.. తెలంగాణ వచ్చిన మూడేళ్లకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్లకు నియామక ప్రక్రియ పూర్తి చేశారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు తీర్చలేదు. యువతకు ఉద్యోగాలు రావాలంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఉద్యోగాలు ఊడాలని గతంలో చెప్పాను. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని నిరుద్యోగులు బాధ్యత తీసుకున్నారు. 90 రోజుల్లో 30వేల కొలువులు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశాం. 65 రోజుల్లో డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేశాం అని వివరించారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వ బడుల పాత్ర కీలకం. డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవాలని కొరివి దెయ్యాలు యత్నించాయి. కేసులు వేసి డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవడానికి కుట్రలు చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భవిష్యత్తు తరాలకు టీచర్లు ఆదర్శంగా మారబోతున్నారు. డీఎస్సీ విజేతల సంతోషాన్ని చూసి కొందరు కళ్లల్లో కారం పెట్టుకొంటారు. ఎంపీగా కవిత ఓడిపోగానే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల గురించి ఆలోచించలేదు గానీ.. కుమార్తెకు మాత్రం 6 నెలల్లో ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల మేలు కోసం విశ్రాంతి తీసుకోకుండా శ్రమిస్తున్నాం. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలి. తెలంగాణ సమాజంపై బీఆర్ఎస్‌కు ఎందుకంత కోపం? ఏడు లోక్‌సభ స్థానాల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు పోయాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు మాకు అధికారం ఇచ్చారు. మా ప్రభుత్వాన్ని పడగొడతామని బీఆర్ఎస్ అంటోంది.. ఇది న్యాయమా? బీఆర్ఎస్‌కు అధికారం రాదు.. తెలంగాణ ప్రజలు ఇవ్వరని మరోమారు స్పష్టం చేశారు. విద్యార్థులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి.. ఉద్యోగ అవకాశాలను పెంపొందిస్తాం. రాష్ట్రంలో ఏటా 1.10లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నారు. నైపుణ్యాలు పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ప్రారభించాం. స్కిల్ వర్సిటీ ద్వారా సాంకేతిక నైపుణ్యం అందిస్తున్నాం. ఒలింపిక్స్ వేదికల్లో దేశం పరిస్థితి ఏంటో చూశాం. నాలుగు కోట్ల జనాభా ఉన్న దక్షిణ కొరియాకు ఒలింపిక్స్‌లో 32 పతకాలు వస్తే.. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌కు ఆ తరహాలో ఒలింపిక్స్‌లో ఎందుకు పతకాలు రాలేదు? తెలంగాణ యువత మత్తుకు బానిసలయ్యారు. వ్యసనాలకు బానిసలై.. యువత తప్పుదోవ పడుతున్నారు.

2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథెట్లకు బంగారు పతకాలు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, సిఎస్ శాంతికుమారి, ఆచార్య కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

## రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

జంపర్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. వైద్యవిభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రదానం అక్టోబర్ 14వరకు కొనసాగనుంది. సోమవారం వైద్యశాస్త్రంలో విజేతలను ప్రకటించగా.. నిన్న భౌతికశాస్త్రంలో నోబెల్ అవార్డులను ప్రకటించారు. ఈరోజు రసాయనశాస్త్రంలో నోబెల్‌కు పురస్కారానికి ఎంపికైన వారి జాబితా వెలువడింది. గురువారం సాహిత్యం విభాగానికి సంబంధించి ప్రకటన ఉంటుంది. శుక్రవారం రోజున నోబెల్ శాంతి బహుమతి అక్టోబర్ 14న అర్థశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లను వెల్లడిస్తారు. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న సంగతి తెలిసిందే.

## కాంగ్రెస్‌వన్నీ విభజన రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ కాంగ్రెస్ చేసిన కుట్రలన్నీ విఫలమయ్యాయని అన్నారు. మహారాష్ట్రలో రూ.7,600 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. హరియాణా ఎన్నికల్లో భాజపా చారిత్రాత్మక విజయం దేశ ప్రజల ఆలోచనను తెలియజేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతులు, దళితులు భాజపాకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ తమ రిజర్వేషన్లను లాక్కొని తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటోందని దళితులు గ్రహించారు. దేశంలోని రైతులను కూడా కాంగ్రెస్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కానీ, తమకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ఎవరు ఇచ్చారో హరియాణా రైతులకు తెలుసు కాబట్టే వారు భాజపాను గెలిపించారు. ప్రజలు కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెప్పారని మోదీ అన్నారు. హరియాణాలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో ప్రజల్లో తమను తప్పుగా చూపించడానికి ఎన్నో కథనాలు రచించి.. ద్వేషపూరిత రాజకీయాలకు పాల్పడిందని ఆరోపించారు. సమాజాన్ని నాశనం చేయడానికి పూనుకున్న ఈ శక్తులన్నింటికీ రాబోయే ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు తగిన సమాధానం ఇస్తారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజలు భాజపా–మహాయుతి ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఖండించారు. ప్రధాని రాజకీయ ప్రసంగాల కోసం ప్రభుత్వ కార్యక్రమాలను ఎందుకు ఉపయోగించుకుంటున్నారని ప్రశ్నించారు. ఇలాంటి ప్రసంగాల కోసం ప్రజల డబ్బును దుర్వినియోగం చేయకుండా భాజపా సొంత సొమ్ముతో వేదికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## 2028 డిసెంబర్ వరకు
## ఉచిత బియ్యం పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని నరేంద్ర దేశ ప్రజలందరికీ పౌష్టికాహార హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ఆహార భద్రతలో భాగంగా ఉచితంగా బియ్యం/ఆహారధాన్యాలు అందించేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనతోపాటు సంబంధిత పథకాలను కేంద్రం పొడిగించింది. 2028 డిసెంబరు వరకు ఉచిత బియ్యం పంపిణీ పథకాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటి కోసం రూ. 17,082 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. రాబోయే పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. లోథాల్‌లో 'నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్' అభివృద్ధికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజస్థాన్, పంజాబ్ సరిహద్దుల్లో రూ.4,406 కోట్లతో 2280 కి.మీ మేర రోడ్ల నిర్మాణానికి అంగీకరించింది. దేశంలో రక్తహీనత, సూక్ష్మపోషకాల లోపాలను అరికట్టేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రధానమంత్రి పోషణ్ అనే పథకం అమల్లో ఉంది. సాధారణ బియ్యంలో పోషకాలను జోడిస్తే ఫోర్టి÷డ్ రైస్ అవుతుంది. పోషక విలువలు పెంచేందుకు కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలపడాన్నే ఫార్టిడ్ రైస్‌గా చెప్పుకోవచ్చు. ఆహారాన్ని బలవర్ధకం చేయడమే లక్ష్యం. బియ్యం, ఇతర ఆహార ధాన్యాలలో ఫార్టిడ్ రైస్ కెర్నెల్స్ కలిపి సరఫరా చేయడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారిస్తామని కేంద్రం ఇప్పటికే తెలిపింది. కొన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. బియ్యాన్ని పిండిగా మార్చి దానికి ఐరన్, జింక్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి–12 వంటి విటమిన్లు, పోషకాలను కలిపి అనంతరం ఆ పిండిని కెర్నెల్స్‌గా మార్చేస్తారు. ఇలా తయారు చేసే పరిశ్రమలు దేశ వ్యాప్తంగా పరిమితంగా ఉనాయి. ఆయా పరిశ్రమల నుంచి మిల్లర్లకు కేంద్రం ఈ ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్ సరఫరా చేస్తుంది. ప్రతి క్వింటాలు బియ్యానికి 1 కిలో ఫార్టిడ్ రైస్ కెర్నెల్స్ కలిసేలా ఇప్పటికే ప్రత్యేక యంత్రాలు కూడా ఉన్నాయి. అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ప్రజాపంపిణీ బియ్యం.. ఇలా దశలవారీగా అన్ని సంక్షేమ పథకాల ద్వారా బలవర్ధక ఆహారం సరఫరా చేయాలని కేంద్రం పట్టుదలగా ఉంది. రాజస్థాన్, పంజాబ్ దేశ సరిహద్దు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.4,406కోట్లు కేటాయించారు. 2,208 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాకిస్థాన్‌తో సరిహద్దు కలిగిన ప్రాంతాల్లో సరిహద్దు గ్రామాలకు కనెక్టివిటీ పెంచుతారు. హైవేతో అనుసంధానం చేయడం ద్వారా సరిహద్దు గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తారు.

## సీఎం రేవంత్‌తో ఆదివాసీ సంఘాల భేటీ

### మంత్రి సీతక్కతో కలిసి వచ్చిన నేతలు
### సీఎం రేవంత్ దృష్టికి పలు సమస్యలు

హైదరాబాద్,అక్టోబర్ 9(నమస్తే ఉదయం): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆదివాసి సంఘాలు భేటీ అయ్యాయి. జూబ్లీహిల్స్ లోని సీఎం అధికారిక నివాసంలో బుధవారం భేటీ అయిన పలు సంఘాల ప్రతినిధులు..తమ ప్రాంత సమస్యలను సీఎంకి వివరించారు. జైనూరు ఘటన దరిమిలా ఆదివాసులు, మైనారిటీ వర్గాల మధ్య సఖ్యత కుదుర్చేందుకు ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఇరు వర్గాలతో ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపారు. దీనికి కొనసాగింపుగా మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చొరవ తీసుకొని



ఆదివాసి సంఘాలను తొడ్కొని సీఎం రేవంత్ రెడ్డి తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తమ సమస్యలను ఆదిలాబాద్ ఆదివాసి సంఘాల ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. స్థానికంగా తమకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరిస్తూ వినతి పత్రాలు అంద చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. తమ భూములు, ఉద్యోగాలు తమకే దక్కేలా చూడాలని కోరారు. ఆదివాసీల సమస్యలు సావధానంగా విన్న రేవంత్ రెడ్డి..దీపావళి లోపు సచివాలయంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తామని, ఆ సమావేశానికి ఆదివాసి సంఘాలను, ముఖ్యలను ఆహ్వానిస్తామని, ఆ సమావేశంలోనే ఆదివాసీల డిమాండ్ల సాధ్యసాధ్యాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆదివాసి సంఘాలకు హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ కలెక్టర్ గా పనిచేసి అక్కడి సమస్య పట్ల పూర్తి అవగాహన ఉన్న దివ్య దేవరాజన్ ను అక్కడికి పంపించి చేపట్టాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎంతోకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించెందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నందున ప్రభుత్వానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదివాసి సంఘాల ప్రతినిధులకు సూచించారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి, సమస్యను పరిష్కరించే దిశలో చూపి సీఎంతో సమావేశం ఏర్పాటు చేసిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణకు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.







# ప్రతి పోలీస్ స్టేషన్‌లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

## - జోగుళాంబ జోన్ డి.ఐ.జి ఎల్.ఎస్.చౌహాన్

### వార్షిక తనిఖీల్లో భాగంగా ఆలంపూర్ సర్కిల్ కార్యాలయాన్ని, ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌ను, డి.ఎస్పి కార్యాలయాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంను సందర్శించి తనిఖీ చేసిన డిఐజి ఎల్.ఎస్. చౌహాన్

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** ప్రతి పోలీస్ స్టేషన్లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పిస్తామని జోగుళాంబ జోన్ డి.ఐ.జి ఎల్.ఎస్.చౌహాన్ తెలిపారు. బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం జోగుళాంబ జోన్ డి.ఐ.జి ఎల్.ఎస్.చౌహాన్ కోదండపూర్ లోని ఆలంపూర్ సర్కిల్ కార్యాలయాన్ని, ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌ను, డి.ఎస్పి కార్యాలయాన్ని జిల్లా పోలీస్ కార్యాలయం ను జిల్లా ఎస్ పి టి శ్రీనివాస రావు తో కలిసి సందర్శించి ఆయా స్టేషన్‌ల రికార్డ్స్‌ను, పరిసరాలను , పోలీస్ స్టేషన్ లో సిబ్బంది నిర్వహిస్తున్న విధులను, జిల్లా పోలీస్ కార్యాలయం లో ఆయా సెక్షన్ అధికారుల రికార్డ్స్ ను తనిఖీ చేశారు. అందులో భాగంగా ముందుగా కోదండపూర్ లోని ఆలంపూర్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. సర్కిల్ కార్యాలయానికి సంబంధించిన సర్కిల్ ఇన్ఫర్మేషన్ బుక్ , క్రైం డైజెస్టర్ రికార్డు , ప్రభుత్వ ప్రాపర్టీ రిజిస్టర్, పిటిషన్ రిజిస్టర్ లను పరిశీలించారు.సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ లలో డయల్ 100 కాల్ రాగానే వెంటనే ఆయా పోలీస్ స్టేషన్ ల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య ను పరిష్కరించేటట్లు చూడాలని, అలాగే బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24x7 గస్తీ నిర్వహించేటట్లు ఆయా ఎస్సై ల ద్వారా చర్యలు చేపట్టాలని ఆలంపూర్ సి. ఐ రవి బాబు కు సూచించారు. తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని, సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సూచించారు. ఇటిక్యాల పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్, ఎస్ హెచ్ వో, మెన్ రెస్ట్ రూమ్, లాక్ అప్ రూమ్‌ను తదితర ప్రదేశాలను పరిశీలించారు.

స్టేషన్‌లో రోజు వారీగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ,సెంట్రీ రిలీఫ్ బుక్, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, ప్రాసెస్ రిజిస్టర్, బీట్ డ్యూటీ బుక్స్, సస్పెక్ట్ చెక్ రిజిస్టర్, సుపీరియర్ ఆఫీసర్స్ విసిటింగ్ బుక్స్, ఫైనల్ రిపోర్ట్స్ తదితర రికార్డ్స్ ను తనిఖీ చేశారు. స్టేషన్ అవరణలో జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు ఐపీఎస్ తో కలిసి మొక్కలను నాటి వాటిని సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని సిబ్బందికి సూచించారు. గద్వాల్‌లో డి.ఎస్పి కార్యాలయాన్ని సందర్శించి డి.ఎస్పి కార్యాలయ రికార్డ్స్ అయిన ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు వివరాలు, తదితర అంశాలను డి.ఎస్పీ సత్యనారాయణని అడిగి తెలుసు కున్నారు.

కార్యాలయంలో నిర్వహించే క్రైమ్ రిజిస్టర్, గ్రేవ్ కేస్ రిజిస్టర్, ఓ.ఈ రిజిస్టర్, మైనర్ పి. ఆర్ రిజిస్టర్, ఇన్స్పెక్షన్స్, విసిట్స్ రిజిస్టర్, FSL రిపోర్ట్ రిజిస్టర్, టప్పల్ డెలివరీ రిజిస్టర్, సుపిరియర్ ఆఫీసర్స్ విసిట్స్ రిజిస్టర్ తదితర రిజిస్టర్ లను పరిశీలించారు. అలాగే షీ టీం పర్ఫామెన్స్ రిజిస్టర్ లను పరిశీలించి రికార్డు ల మెంటేనేన్స్ నిర్వహణ ను పరిశీలించారు.అన్ని పోలీస్ పోలీస్ స్టేషన్లు, సిర్కిల్ కార్యాలయంలో 5S అమలు తీరును, ఫంక్షనల్ వర్టికల్ నిర్వహణను పర్యవేక్షించాలని అన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ లలో నమోదు అయిన కేసుల పై తరచు ఎస్సైలు, సిఐలతో రివ్యూ సమావేశాలు నిర్వహించి పర్య వేక్షించాలని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ను మరింత బలోపేతం చేసేందుకు పోలీస్ అధికారులకు ఎప్పటి కప్పుడు ఆదేశాలు ఇవ్వాలని డి. ఎస్పీ కి తెలిపారు. జిల్లాలో తరచుగా పోలీస్ స్టేషన్ లను, సర్కిల్ కార్యాలయాలను విసిట్ చేసి పర్యవేక్షించాలని అన్నారు. అలగే గద్వాల్ సర్కిల్ కార్యాలయ రికార్డ్స్, గద్వాల్ టౌన్ పోలీస్ స్టేషన్, ఐజ పోలీస్ స్టేషన్ రికార్డ్స్ ను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయల సిబ్బంది, పోలీస్ స్టేషన్ ల సిబ్బందితో జోగులాంబ జోన్ డి.ఐ.జి ఎల్.ఎస్.చౌహాన్ మాట్లాడుతూ...

పోలీస్ స్టేషన్ లో 5Sను ఎవరి పరిధిలో వారు నిత్యం అమలు అయ్యేటట్లు చూసుకోవాలని, స్టాఫ్ కు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. మహిళ అధికారులకు రెస్ట్ రూమ్ సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, రోజు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్‌గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగ కుండా చూసుకోవాలని ఆదేశించారు.

డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24x7 గస్తీ నిర్వహించాలని, రౌడీ షీటర్స్, సస్పెక్ట్స్ , పాత నేరస్థుల పై నిఘా పెట్టాలని బ్లూ కోల్ట్స్ సిబ్బందికి అధికారులకు సూచించారు.

గంజాయి ,గుట్కా గుడుంబా సరఫరాపై, గ్యాంబ్లింగ్‌పై నిఘా ఉంచాలని అన్నారు. CCTNS అప్లికేషన్ పై అందరూ అవగాహన కలిగి ఉండాలని, కమ్యూనిటీ పోలిసింగ్ మరియు ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానన్ని అమలు పరచాలని ప్రజలకు ఎప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, సిబ్బంది అందరూ బాధ్యత యుతంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.

**జిల్లా పోలీస్ కార్యాలయ తనిఖీలు**

జిల్లా పోలీస్ కార్యాలయ తనిఖీ కి వచ్చిన గౌరవ డి. ఐ. జి గారు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయ పరిసరాలను పరిశీలించారు.

జిల్లా పోలీస్ కార్యాలయం లో వివిధ విభాగాలు అయిన SB, DCRB రికార్డులను, A సెక్షన్, B- సెక్షన్ విభాగాల రికార్డులను, హెడ్ క్వార్టర్స్ కు సంభందించిన ప్లాటూన్ రికార్డ్స్, అడ్మిన్ స్టోరీ రికార్డ్స్, బెల్ ఆఫ్ ఆర్మ్స్ (ఆయుధాల) రికార్డ్స్ లను, MT సెక్షన్ రికార్డ్స్, హోం గార్డ్స్ రిజిష్టర్ లను మరియు డాగ్ స్క్వాడ్ రికార్డులను, రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సంధర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం లో విభాగాల సిబ్బంది పని తీరును ఎస్ పి శ్రీనివాసరావు డిఐజికి వివరించారు. కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతు పోలీస్ సిబ్బంది సర్వీస్ కు సంబందించి వచ్చే విన్నపాల ఉన్నతాధికారుల ఆదేశాలపై ఎప్పటికపుడు పూర్తి చేయా లని సిబ్బందిని ఆదేశించారు.

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎస్పీ శ్రీనివాసరావు తీసుకుంటున్న చర్యలపై డిఐజి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో డిఎస్ పి కె.సత్యనారాయణ, జిల్లా పోలీస్ కార్యాలయ ఏఓ సతీశ్ కుమార్, సాయుధ దళ డిఎస్ పి శ్రీ నరేందర్ రావు,ఆలంపూర్ , గద్వాల్ , శాంతి నగర్ సీఐ లు రవి బాబు, నాగేశ్వర రెడ్డీ, టాటా బాబు జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలు సిసి హరి ప్రసాద్,జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

---

## నేడు ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో

# బతుకమ్మ వేడుకలు

### పెద్ద తాళ్లకుంటను పరిశీలించిన కమిటీ సభ్యులు



**రాజేంద్రనగర్, అక్టోబరు9(నమస్తే ఉదయం):** హైదర్‌గూడ ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో గురువారం జరగబోయే బతుకమ్మ నిమజ్జనం గురించి పెద్ద తాళ్లకుంటలో సంఘం ప్రతి నిధులు ఏర్పాట్లను పరిశీలించారు. ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు మోంద్ర నర్సింహా , కమిటీ సభ్యులు. హైదర్ గూడ , ఉప్పరపల్లి , శివానగర్ కృష్ణానగర్ కేశవ నగర్ రాధాకృష్ణ నగర్, కాంతరెడ్డి నగర్ కాలనీవాసులు ఇంకా చుట్టు ప్రక్కల చాలా కాలనీవాసులు ప్రజలు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో ఆటపాట లతో ఆడుకుంటూ బతుకమ్మలతో విచ్చేస్తారని, పెద్ద తాళ్ల కుంట లో పెరిగిన గుర్రపు డెక్క ఆకును పూర్తిగా తొలగించాలన్నారు. తాత్కాలిక బేబీ పాండ్ ను ఏర్పాటు చేయాలని జిహెచ్‌ఎంసి ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ రాజుకు తెలియజేసారు. రాత్రిపూట చీకటి ఉంటుంది కాబట్టి భక్తులకు మహిళ లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు తెలియజేసినారు. ఈ కార్యక్ర మంలో సంఘం ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, ఉపాధ్యక్షులు బర్ల మల్లారెడ్డి, శ్రీ ప్రణవభక్త సమాజము ముఖ్య సలహాదారు నార గూడెం మల్లారెడ్డి, సాబాద విజయ్ కుమార్, కాకులారం కృష్ణ, ఎల్. వెంకటేష్, ఎం ఉపేందర్ రెడ్డి, ఎం.శ్యాంసుందర్ రెడ్డి, ఎం రామ్ రెడ్డి, గొల్ల అనిల్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి,బాలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

---

# ప్రజాభిప్రాయాన్ని గౌరవించండి..

### పాదయాత్రకు అడ్డంకులు ఎందుకు....

### నరేందర్ రెడ్డి అరెస్టు అప్రజాస్వామిక చర్య.

### అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ శ్రేణులను వెంటనే విడుదల చేయాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్.




**కొడంగల్, అక్టోబరు9(నమస్తే ఉదయం):** కొడంగల్ నియోజకవర్గములో ఫార్మా కంపెనీల పేరుతో రైతుల భూములను లాక్కోవటాన్ని నిరసిస్తూ శాంతియుతంగా పాదయాత్ర చేసి నిరసన తెలపాలని సిద్ధం అయినా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అరెస్టును మాజీ మంత్రి,ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం, ఇనుప కంచెలు తొలిగించామని, ధర్నా చౌక్ తెరిచామని ఒక వైపు చెబుతూ,మరోవైపు ప్రజాస్వామ్య యుతంగా, శాంతియుతంగా పాదయాత్ర చేపడితే ఎందుకు అడ్డుకుంటుం దని ప్రశ్నించారు. ఇలాంటి నిర్బంధాలు గతంలో ఎన్నడూ చూడలేదని ,గ్రామం నుండి మొదలు కొని నగరం వరకు వందలాది మంది బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను అరెస్ట్ చేయటం జరిగిందని వారందరినీ వెంటనే విడుదల చేయాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డితో పాటు,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని, ఫార్మా సిటీ కోసం ఇప్పటికే సిద్దంగా ఉన్న భూములను వదిలిపెట్టి కొడంగల్ పరిధిలోని 5 గ్రామాల్లోని 3 వేల ఎకరాల భూమి సేకరించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించాలని,వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

---





# శ్రీ శృంగేరి శంకరమఠంలో సరస్వతీ దేవి అలంకారంలో ప్రత్యేక పూజలు

**శంషాబాద్,అక్టోబర్ 9( నమస్తే ఉదయం):** శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని ఉట్ పల్లిలో ఉన్న శ్రీ శృంగేరి శంకరమఠములు దేవీ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. విజయదశమి పర్వదినం సందర్భంగా మన ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో శాస్త్రక్తంగా నిర్వహిస్తు న్నారు. శుభరాత్రి వేడుకల సందర్భంగా ప్రతిరోజు ఉదయం సాయంత్రం అమ్మవారికి వివిధ రూపాలలో అలంకరిస్తున్నారు. మరోవైపు పరమేశ్వర స్వామి ని కూడా కర్నూలు పండుగ అలంకరించి పొందిన నిర్వహిస్తున్నారు.

మనం పరమశివుడితో పాటు శారదా దేవికి ప్రత్యేకంగా లేద పండితులు పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్న స్వామి వారిని అమ్మవారిని దర్శించు కుంటున్నారు.

---

## పశు వైద్య విశ్వవిద్యాలయంలో

# బతుకమ్మ సంబరాలు

**రాజేంద్రనగర్, అక్టోబరు9(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ లోని పీవీ నరసింహారావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం ఆవరణలో బుధవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విశ్వవిద్యాలయానికి చెందిన మహిళ ఉద్యోగులు, అధికారులు బతుకమ్మ సంబరాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో వర్సిటీ ఉన్నతాధికాదులు డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాష్, డాక్టర్ టి. రఘునందన్, డాక్టర్ ఎం. ఉదయ్ కుమార్ , డాక్టర్ మాధురి , డాక్టర్ నళిని, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ షర్ఫుద్దీన్, ప్రధాన కార్యదర్శి ఆర్.సుదర్శన్, టి నరసింహ, సి మధుసూదన్, జి అంజి, ఎస్ రాజు. తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు తెలంగాణ రాష్ట్ర పశు వైద్య విశ్వవిద్యాలయంలో బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న అధికారులు



విశ్వవిద్యాలయంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న రిజిస్టర్ డాక్టర్ రఘురాం రెడ్డి

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు..

**రాజేంద్రనగర్,అక్టోబర్ 09 (నమస్తే ఉదయం):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం ప్రాంగణం ముందు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. పరిపాలన భవనం ఆవరణలో తొలుత విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్,పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామి రెడ్డి గౌరమ్మకి పూజలు చేశారు. బతుకమ్మ మన సంస్కృతికి ప్రతీక అని ఆయనన్నారు.తర్వాత మహిళ అధికారులు, ఉద్యోగులు ఆడుతూ పాడుతూ బతుకమ్మ సంబరాలు చేశారు.పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు,తదితరులు పాల్గొన్నారు.



## దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ వేడుకలు అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు. బుధవారం రాజేంద్ర్ నగర్ నియోజకవర్గం పరిధిలో ఘన వివిధ ప్రాంతాలలో జరిగిన దుర్గామాత ఉత్సవాలలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దుర్గా మాత మండపాన్ని సందర్శించి అమ్మ వారి పూజా , అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు.



నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలలో జరిగిన శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవి

### - జిల్లా న్యాయమూర్తి ఆంజనేయులు

### రాజేంద్రనగర్ ఉప్పరపల్లి కోర్టు ఆవరణలో బతుకమ్మ వేడుకలో పాల్గొన్న జిల్లా న్యాయమూర్తి ఆంజనేయులు

**రాజేంద్రనగర్,అక్టోబర్ 09(నమస్తే ఉదయం):** తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. తీరొక్క పూలతో చేసిన బతుకమ్మలతో పల్లెలు, పట్టణాలన్నీ వర్ణరంజితమయ్యాయి. బతుకమ్మ వేడుకల్లో భాగంగా రాజేంద్రనగర్ ఉప్పరపల్లి కోర్టు ఆవరణలో న్యాయవాదులు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మలను పేర్చి ప్రతి ఒక్కరికి బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బతుకమ్మ పాటలతో నృత్యాలు చేస్తూ ఆడిపాడి సంబరాలను జరుపుకున్నారు.



బతుకమ్మలకు పూజలు చేస్తున్న న్యాయమూర్తి

ఈ వేడుకల్లో జిల్లా న్యాయమూర్తి ఆంజనేయులు,11వ మెట్రోపాలిటన్ న్యాయమూర్తిరాలు నీలెమ్మ,12వ కోర్టు న్యాయమూర్తి,కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఎల్.శ్రీధర్ రెడ్డి.వైస్ ప్రెసిడెంట్ వెంకటేశం.జాయినర్ సెక్రటరీ తులసీరామ్, కృష్ణయాదవ్,పాష, ఖలీల్,సిద్దయ్య,ప్రోరెన్స్, అయ్యప్పరెడ్డి,శ్రీనివాస్ నాయుడు,సిద్దేశ్వర్, సుధాకర్ రెడ్డి,రామ్ లక్ష్మారెడ్డి,బి.ఎన్.చారి,జ్ఞానేశ్వర్ చారి,ప్రవీణ్ కుమార్,హరిప్రసాద్ రెడ్డి,శశాంత్ రెడ్డి, విజయ్ కుమార్,నరసింహారెడ్డి, నాయుడు,ఫ్లవర్, సునీత,బండయ్య,రంగారెడ్డి,రవీందర్,మంజుల, మౌనిక,విజయ,కోర్టు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## భవాని కాలనీలో కొలువుదీరిన సరస్వతి దేవి

**రాజేంద్రనగర్, అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని భవాని కాలనీ (ప్రేమవతి పేట) లో గల శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కాలనీకి చెందిన మహిళలు అమ్మవారిని సరస్వతి దేవి రూపంలో అలంకరించి సాంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. సరస్వతి దేవి ఆశీస్సులతో తమ పిల్లలు జ్ఞానం పెంపొందించుకొని ఉన్నత చదువులలో రాణించాలని మహిళలు కోరుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు అన్ని ఏర్పాట్లు నిర్వహించారు.





సరస్వతి దేవి అలంకరణ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో సరస్వతి పూజ






రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎస్ ఇ శ్రీరామ్ మోహన్, బతుకమ్మలకు నమస్కరిస్తున్న ఎస్ ఇ శ్రీరామ్ మోహన్

## రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

### తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ: ఎస్ ఇ శ్రీరామ్ మోహన్

**మెహిదీపట్నం, అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** తెలంగాణ ఆడపడుచులు, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా బతుకమ్మ పండుగని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ సూపర్నెంట్ ఇంజనీర్ డి శ్రీరామ్ మోహన్ అన్నారు, బుధవారం మెహిదీపట్నం లోని నానల్ నగర్ చౌరస్తాలో గల రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సంప్రదాయ బద్దంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ బతుకమ్మ వేడుకలలో ఎస్ ఇ. డి శ్రీరామ్ మోహన్, ఎస్ ఏ ఓ వీరస్వామి, డి ఈ (టెక్నికల్) రామచంద్రయ్య, కందుకూరు డివిజన్ డి ఈ పి రాజారాంరెడ్డి, మహిళా ఉద్యోగులు అధికారులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆట ఆడుతున్న మహిళా అధికారులు ,ఉద్యోగులు

## పార్టీ సభ్యత్వ నమోదు అత్యధిక సంఖ్యలో చేపట్టి ప్రజలకు చేరువ కావాలి

### బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సంజయ్

**రాజేంద్రనగర్,అక్టోబర్ 09(నమస్తే ఉదయం):** పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భారీ సంఖ్యలో చేపట్టి ప్రజలకు చేరువ కావాలని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సంజయ్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ఎర్రబోడలో బిజెపి ఆన్లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మల్లేష్ చారి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ డివిజన్‌లో ప్రతి బూతులో 200 సభ్యత్వ నమోదు చేయాలని కోరారు.ఈ మేరకు ప్రతి ఒక్కరూ శ్రమించాలని సూచించారు. భారతీయ జనతా పార్టీ సారధ్యంలో ప్రధాని మోడీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగాలని వివరించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోయి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన అన్నారు. బీజేపీ ఒక సిద్ధాంతాలతో పనిచేసే పార్టీ అని అన్నారు. బీజేపీని ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మొండ్రా కొమురయ్య, సత్యనారాయణ ముదిరాజ్, ఎల్.వెంకటేష్, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.



ఎర్రబోడలో పార్టీ సభ్యత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న బిజెపి నాయకులు



నానల్ నగర్ చౌరస్తాలో గల విద్యుత్ కార్యాలయంలో జరిగిన దుర్గామాత పూజల్లో పాల్గొన్న ఎస్ ఈ చంద్రశేఖర్, శ్రీదేవి దంపతులు

## విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా దుర్గామాత పూజలు

### పూజల్లో పాల్గొన్న ఎస్ ఇ దంపతులు చంద్రశేఖర్, శ్రీదేవిలు

**మెహిదీపట్నం, అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ కార్యాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బుధవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన దుర్గామాత పూజలలో సర్కిల్ సూపరెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఆయన సతీమణి శ్రీదేవి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్ ఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో సంస్థలో పని చేస్తున్న ప్రతి అధికారి, ఉద్యోగి, క్షేత్రస్థాయి సిబ్బంది సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

సంస్థలో పనిచేస్తున్న అధికారులు ఉద్యోగులు సిబ్బంది సమిష్టిగా కలిసి పనిచేసే వినియోగదారులకు నిరంతర సేవలు అందిస్తూ సంస్థ ఆదాయానికి తోడ్పాటునందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ డిఈ (టెక్నికల్) దామోదర్ రావు, అకౌంట్స్ ఆఫీసర్, మురళి గౌడ్, ఉద్యోగ సంఘం నేత భాస్కర్ రెడ్డి, మహిళ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పండగ పండగా లేకుండా పోయింది

### యూపిలోనే అనుకుంటే..తెలంగాణలోనూ బుల్డోజర్లు

### రేవంత్ సర్కార్‌పై కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** రాష్ట్రంలో బతుకమ్మ బతుకమ్మ లాగా లేదు.. దసరా దసరా లాగా లేదు.. ఈ పండుగల వేళ బుల్డోజర్లతో భయానక వాతావరణం సృష్టించారని రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ సీనియర్ లీడర్ మహమ్మద్ అలావుద్దీన్ పటేల్ సహా ఆయన అనుచరులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు. ఇప్పుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటే ఇప్పటికే రైతుల ఖాతాల్లోకి పైసలు, ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు వచ్చేవి. ఈ సారి పండుగ పండుగ మాదిరిగా లేకుండా పోయింది. రాష్ట్రంలో పండుగ జరుపుకునే పరిస్థితి లేకుండా భయానక వాతావరణం సృష్టించారు. వరంగల్‌లో ఓ ఎమ్మార్వో బతుకమ్మ ఘాట్ చూసేందుకు వెళితే ఇళ్లు కూలగొట్టేందుకు వచ్చారనుకొని వాళ్లను స్థానికులు తరమికొట్టారు. అలా ఉంది రాష్ట్రంలో పరిస్థితి అని కేటీఆర్ తెలిపారు.యూపీలోనే బుల్డోజర్ సీఎం ఉన్నాడుకున్నాం. కానీ మన తెలంగాణలో కూడా ఇప్పుడు అలాంటి బుల్డోజర్ సంస్కృతిని తీసుకొచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆఘాయిత్యాలను చూసి ప్రతి ఒక్కరూ కేసీఆర్‌ను తలచుకుంటున్నారు. అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ పది నెలల వాళ్ల పాలనలో అన్ని వర్గాలు అసంతృప్తితో ఉన్నాయి.



## వడ్డేపల్లి మున్సిపల్ కేంద్రంలో అంగరవైభవంగా బతుకమ్మ సంబరాలు

### మహిళలకు చీరలు అందజేసిన మాజీ జెడ్ పి టి సి శ్రీనివాసులు

**వడ్డేపల్లి, అక్టోబర్ 9(నమస్తే ఉదయం):** వడ్డేపల్లి మున్సిపల్ కేంద్రంలో శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి.

బుధవారం శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు రామచంద్రనగర్‌లో జరిగిన బతుకమ్మ సంబరాలో మాజీ జడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాలనీలో నిర్వహించిన బతుకమ్మను ఎత్తుకొ పుట్టింట చీర కట్టుకో...! పోటీల్లో విజేతలకు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి శ్రీనివాసులు లక్కీ డిప్ ద్వార 5 వేల 5 వందల రూపాయల విలువగా పట్టు చీరను,10 మంది మహిళలకు, బహుమతిగా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మానవపాడు మండల మాజీ ఎంపీపీ అశోక్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు జిల్లేడుదీన్నే సుదర్శన్ , నాయకి ధర్మ , వేణు, గోకారి, బీచుపల్లి, నంద, నాగరాజు, కాలానీ వాసులు పాల్గొన్నారు.







దుర్గామాత పూజల్లో పాల్గొన్న వడ్డేపల్లి మండలం మాజీ జెడ్ పి టి సి వడ్డేపల్లి శ్రీనివాసులు, విజేతలకు చీరలను అందజేస్తున్న శ్రీనివాసులు


**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. “RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733